దాతల సహకారంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు



ఆలయ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి

చంపాపేట: దాతల సహాయ, సహకారాలతో కర్మన్‌ఘాట్ శ్రీ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించటం జరుగుతుందని ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి అన్నారు. సోమవారం ఆయన పాలక మండలి సభ్యులతో కలసి ఆలయంలోని కోనేరు సమీప రహదారిపై ఏర్పాటు చేస్తున్న రేకుల షెడ్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ శని, మంగళ వారాలలో స్వామివారిని దర్శించుకునేందుకు వేలాదిమంది భక్తులు ఆలయానికి వస్తున్నారని వారికి ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా దాతల సహకారంతో సత్యనారాయణ స్వామివారి మండపం చుట్టూ రఫ్‌బండలు ఏర్పాటు పనులు కూడా ప్రారంభించటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఆనంద్‌కుమార్, యాదగిరి, కళ్యాణ్, తిరుమలేష్, మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి



ఎఫ్‌సీఐ కాలనీలో డ్రైనేజీ సమస్యను జలమండలి జీఎంకు చూపిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: వర్షాల కారణంగా పలు కాలనీలలో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, జలమండలి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్, ప్రశాంత్‌నగర్, ఎఫ్‌సీఐకాలనీ, జహంగీర్‌నగర్, వెంకటరమణ కాలనీలలో జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డితో కలసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను జీఎం దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలలో వరదనీరు నిలువకుండా, మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు రోడ్లపైకి పారకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన జీఎంను కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కు అందజేత



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: పేదింటి ఆడపడుచుల వివాహాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిహెచ్‌ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన రంగా లక్ష్మి కూతురు వివాహం సందర్భంగా కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన లక్ష 116 రూపాయల చెక్కును ఆమెకు సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దర్పల్లి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నాగోలులో ముగిసిన భూపాల్‌రెడ్డి అంత్యక్రియలు

తెలంగాణ మలిదశ ఉద్యమంలో భూపాల్‌రెడ్డి కీలకపాత్ర



నాగోలు/మన్సూరాబాద్: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, లియాఫీ (భారతీయ జీవిత బీమా సంస్థ) మాజీ అధ్యక్షుడు జనగాం భూపాల్‌రెడ్డి ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుమారుడు, కూతురు ఇద్దరు అమెరికాలో ఉండటంతో సోమవారం ఉదయం నాగోలులోని శ్మశానవాటికల్లో అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే... భువనగిరి యాదాద్రి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామానికి చెందిన జనగాం భూపాల్‌రెడ్డి గత కొంతకాలంగా నాగోలు ఆదర్శనగర్ కాలనీలో నివాసముంటున్నాడు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించాడు. లియాఫీ అధ్యక్షుడిగా ఉంటూ ఏజెంట్లకు ఆర్థికభద్రతకు పాటుపడ్డాడు. తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకులు కేవీ రంగారెడ్డి, ఉద్యమకారులతో పాటు ఎల్‌ఐసీ ఏజెంట్లు సోమవారం జనగాం భూపాల్‌రెడ్డికి నివాళులు అర్పించారు. ఈ అంత్యక్రియాల్లో సింగరపు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సుదర్శన్, జన్నెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బొగ్గుల మాధవరెడ్డి, సీనయ్య పాల్గొన్నారు.

దొంగను పట్టించిన డ్రైవర్, కండక్టర్

నాగోలు: చోరీలకు పాల్పడుతున్న జేబు దొంగల ముఠాలోని ఓ సభ్యుడిని ఆర్టీసీ బస్ డ్రైవర్, కండక్టర్ పోలీసులకు పట్టించిన సంఘటన చోటుచేసుకుంది. ఎల్‌బీనగర్ డీఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 22న హయత్‌నగర్ -1 టీజీఎస్ ఆర్టీసీ బస్ దిల్‌సుఖ్‌నగర్ నుంచి చౌటుప్పల్‌కు వెళుతోంది. ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ఏడుగురు బస్సులోకి ఎక్కారు. వారు 19వ తేదీన అదే బస్సులో ప్రయాణించి తుప్రాన్‌పేట వద్ద బస్సు దిగిన ఓ వృద్ధ ప్రయాణికుడి వద్ద రూ. 50 వేలు లాక్కుని పారిపోయారు. అయితే బస్సులో ఎక్కిన నిందితులను బస్సు డ్రైవర్ చక్రపాణి, కండక్టర్ జయశ్రీ గుర్తు పట్టారు. డ్రైవర్ చక్రపాణి బస్సు నిలిపి 19వ తేదీన వృద్ధుడి వద్ద డబ్బులు కొట్టేసింది మీరే కదా అనడంతో వారు వెంటనే బస్సు దిగి పరారవుతుండగా వారిలో ఒకడిని పట్టుకుని తొలుత హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఎల్‌బీనగర్ డిటెక్టివ్ పోలీసులు అతడిని అరెస్టు చేసి విచారించగా అతడు భువనగిరి టౌన్‌కు చెందిన కొమ్ము ప్రశాంత్(24) అని, జేబు దొంగల ముఠా సభ్యుల్లో ఒకడని గుర్తించారు. ఈ మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు ప్రశాంత్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అధికారుల అండతో.. రోడ్డు ఆక్రమణ!

కుంచించుకుపోతున్న జిల్లా పరిషత్ రోడ్డు

- నిమ్మకునీరెత్తినట్లుగా ఎల్‌బీనగర్ టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరు
- 90 ఫీట్లు ఉండాల్సిన రోడ్డు 30 నుంచి 40 ఫీట్లకే పరిమితం
- ఆక్రమణలు తొలగించాలని స్థానికుల విజ్ఞప్తి



హస్తినాపురం జెడ్పీ రోడ్డును ఆక్రమించి సెల్లార్‌తో సహా నిర్మిస్తున్న అక్రమ కట్టడం

హస్తినాపురం: జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ పట్టణ ప్రణాళిక అధికారుల అవినీతి, ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపం కారణంగా హస్తినాపురంలోని జిల్లాపరిషత్ రోడ్డు పూర్తిగా కుంచించుకుపోతుందని వివిధ కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిషత్ రోడ్డు మాస్టర్‌ప్లాన్‌లో 100 ఫీట్లు ఉండగా ఆతర్వాత 90 ఫీట్లకు మార్చారు. ఈ రోడ్డుకు ఇరువైపులా రోడ్డును ఆక్రమించుకుని నివాస సముదాయాలకు అనుమతులు తీసుకుని రోడ్డును ఆక్రమించుకుని వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారని, ఎలాంటి అనుమతులు లేకుండానే దాదాపు 30కిపైగా రోడ్డును ఆక్రమించుకుని రేకుల షెడ్డులతో వాణిజ్య సముదాయలు నిర్మించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయా కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ జిల్లా పరిషత్ రోడ్డు 20 కాలనీలకు ముఖద్వారంగా ఉన్నదని ఈ రోడ్డు తెలంగాణ చౌరస్తా నుంచి మొదలుకొని టికేఆర్ రోడ్డు వరకు నిర్మాణాలు చేపడుతూ రోడ్డును సగానికి పైగా ఆక్రమించుకుంటున్నారని దీంతో రోడ్డు పూర్తిగా కుంచించుకుపోతుందని ఈ విషయమై సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా నిర్మాణదారుల నుంచి ముడుపులు తీసుకుని పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డుకు ఇరువైపులా రోడ్డును ఆక్రమించుకుని అక్రమ సెల్లార్లు ఏర్పాటు చేసి నిర్మాణాలు చేపట్టడంతో ఒక్కో దగ్గర 30, నుంచి 40 ఫీట్లు మాత్రమే ఉండడంతో రోడ్డుపై తరుచూ ట్రాఫిక్ స్తంభించిపోతుందని ఆయా కాలనీల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎల్‌బీనగర్ సర్కిల్ ఉన్నతాధికారులు స్పందించి హస్తినాపురం జిల్లా పరిషత్ రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలని వివిధ కాలనీల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ఆక్రమణ వల్ల తరుచూ ప్రమాదాలు



జిల్లా పరిషత్ రోడ్డును ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టడం వల్ల రోడ్డు పూర్తిగా కుంచించుకుపోయి తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గత ఆరు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారి సైతం మృతి చెందిన విషయం విధితమే. ఎల్‌బీనగర్ టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతి మూలంగానే ఈరోడ్డు పూర్తిగా కుచించుకుపోతుంది. చైన్‌మెన్ నుంచి మొదలుకొని టీపిఎస్, ఏసిపి వరకు నిర్మాణదారులు పెద్ద ఎత్తున ముడుపులు ముట్టచెప్పడంతోనే రోడ్డు ఆక్రమణల వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశాం అయినా స్పందించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్డు ఆక్రమణలకు గురైన ప్రాంతాలలో వాటిని తొలగించాలి.

– గోదల రఘుమారెడ్డి, వెంకటేశ్వరకాలనీ మాజీ అధ్యక్షుడు

టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతి కారణంగానే రోడ్డు ఆక్రమణలు..



టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి కారణంగానే జిల్లా పరిషత్ రోడ్డు పూర్తిగా కుంచించుకుపోతోంది. హస్తినాపురం జిల్లా పరిషత్ రోడ్డు మాస్టర్ ప్లాన్‌లో 100 ఫీట్లు ఉండగా తర్వాత 90 ఫీట్లకు మార్చారని ప్రస్తుతం ఈ రోడ్డులో టౌన్‌ప్లానింగ్ అధికారుల అండతో రోడ్డును ఆక్రమించుకుని ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు గండి కొడుతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఈ ప్రాంతాన్ని సందర్శించి రోడ్డు ఆక్రమణలు తొలగించాలి.

– దుర్గయ్యగౌడ్-వెంకటేశ్వర కాలనీ

పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలి

- ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అక్కారి మహేష్

నాగోలు: ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిందని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అక్కారి మహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరాల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, సమస్యలపైన నిత్యం విద్యార్థి పరిషత్ నుంచి అధికారులకు వినతి పత్రాలు అందజేసినప్పటికీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, అధ్యాపకులు లేక నానా అవస్థలు పడుతుంటే మరొకవైపు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు లక్షలకు లక్షలు ఫీజులు దండుకుంటున్నా ప్రభుత్వానికి ఏమీ పట్టడం లేదని, కేవలం ప్రకటనలు మాత్రమే చేస్తూ చేతులు దులుపుకుంటుందని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపైన చర్యలు తీసుకుంటామంటూ, ఫీజు నియంత్రణ చట్టం అమలు చేస్తామంటూ హామీలు ఇస్తున్నారు తప్ప అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడంలో, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైన ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 26వ తేదీన పాఠశాలబంద్‌కు ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపునిచ్చిందని తెలియజేశారు. యాజమాన్యాలు బంద్‌కు సహకరించి, బంద్‌ని విజయవంతం చేయాలని కోరారు.

అనుమతి లేదని కాకతీయ పాఠశాల సీజ్


- ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలలపై కఠిన చర్యలు
- హయత్‌నగర్ మండల విద్యాధికారి హీర్యానాయక్



బొమ్మలగుడి సమీపంలోని కాకతీయ పాఠశాలను సీజ్ చేస్తున్న మండల విద్యాధికారి హీర్యానాయక్

మన్సూరాబాద్: ప్రభుత్వ అనుమతి లేకుండా తరగతులు నిర్వహిస్తున్నారని హయత్‌నగర్ పవనగిరి కాలనీలోని కాకతీయ స్కూల్‌ను హయత్‌నగర్ మండల విద్యాధికారి హీర్యానాయక్ సోమవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేని పాఠశాలలపై చట్టప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. హయత్‌నగర్ బొమ్మలగుడి సమీపంలోని కాకతీయ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నారని పలు ఫిర్యాదులు అందాయన్నారు. బీజేవైఎం రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ డీఈఓకు ఫిర్యాదు చేశారని, రంగారెడ్డి జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు కాకతీయ పాఠశాలను సీజ్ చేసినట్లు తెలిపారు. నకిలీ డాక్యుమెంట్లతో దరఖాస్తు చేశారని ఫిర్యాదులున్నాయని, అన్ని పరిశీలించి చట్టప్రకారం కాకతీయ పాఠశాలపై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కాకతీయ పాఠశాల యాజమాన్యం అడ్మిషన్లు తీసుకోవద్దని మే నెలలోనే నోటీసులు ఇచ్చామని, అయినప్పటికీ పాఠశాల యాజమాన్యం అడ్మిషన్లు చేపట్టిందని, ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతరు చేసిందన్నారు. పాఠశాల భవనానికి జీహెచ్‌ఎంసీ అనుమతి లేదనే ఫిర్యాదులున్నాయని, అన్ని డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలన చేపడుతామని స్పష్టం చేశారు. పాఠశాలలో తరగతులు నిర్వహించవద్దని, ఒక వేళ తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కాకతీయ పాఠశాల యాజమాన్యాన్ని ఎంఈఓ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రంగారెడ్డి అర్బన్‌జిల్లా ఎడ్యుకేషన్ సెల్ కన్వీనర్ జైసాయి, బీజేవైఎం ఎల్‌బీనగర్ కోకన్వీనర్ సాయిరామ్‌గౌడ్, మన్సూరాబాద్ అధ్యక్షుడు జయతేజ తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగకు ఏర్పాట్లు షురూ



మలక్‌పేట డీసీ జయంత్

ఇప్పటికే సిబ్బందిని అప్రమత్తం చేశాం : డీసీ జయంత్

చాదర్‌ఘాట్: బోనాల పండుగను పురస్కరించుకొని జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు పనులు మొదలు పెట్టినట్లు మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా మలక్‌పేట సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో దాదాపు 80కి పైగా చిన్నా , పెద్ద దేవాలయాలు ఉన్నాయని తెలిపారు. దేవాలయాల వెళ్లే మార్గంలో రోడ్డు గుంతలు పూడుస్తామని తెలిపారు. విద్యుత్‌కు సంబంధించి ఏరియా విద్యుత్‌కు ఏఈకి కరెంట్ సప్‌లై ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ప్రతీ దేవాలయం ఎదుట వైట్‌వాష్ లైన్ ఏర్పాటు చేయాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు. ఘటాల రోజు దేవాలయం ముందు మార్కింగ్ ఏర్పాటు, అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు నరికివేయాలని హార్టికల్చర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అదే విధంగా దేవాలయానికి సమీపంలో కుక్కల సంచారం లేకుండా సంబంధిత వెటర్నరీ అధికారులకు సూచించామన్నారు. పండుగ ముందు తరువాత ఎంటమాలజిస్ట్ స్ప్రే చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకొని పండుగలను విజయవంతం చేస్తామని తెలిపారు.

సమయానికి ప్రారంభం కాని పోటీ పరీక్ష

- పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల బంధువుల ఆందోళన
- రీ షెడ్యూల్ ఉత్తర్వులు చేసిన టీజీపీఎస్సీ అధికారులు



సైదాబాద్: పోటీ పరీక్షలకు నిముషం ఆలస్యమైనా అధికారులు కేంద్రంలోకి విద్యార్థులను, అభ్యర్థులను లోపలికి అనుమతించరు. అలాంటిది అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రంలోకి చేరుకున్నా రెండు గంటలకుపైగా వారికి అధికారులు పరీక్ష మొదలు పెట్టలేదు. దీంతో అభ్యర్థులు గందరగోళానికి గురవ్వగా, వారి తల్లిదండ్రులు, బంధువులు కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. సైదాబాద్‌లోని మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం టీజీపీఎస్సీ వారి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగ నియామకానికి సంబంధించి పోటీ పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 గంటలకు మొదలు కావలిసిన పరీక్ష మధ్యాహ్నం 12 అయినా ప్రారంభం కాలేదు. దీంతో పరీక్షకు హాజరైన అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న వారి బంధువులు, బీజేపీ యువమోర్చా నాయకుడు రమణ్‌సింగ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. నిర్వాహకుల ద్వారా విషయం తెలుసుకున్న టీజీపీఎస్సీ అధికారులు సాంకేతిక సమస్య కారణంగా అక్కడ పరీక్ష ప్రారంభం కాలేదని, వారికి మాత్రం తిరిగి పరీక్ష నిర్వహిస్తామని రీ షెడ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు.

డ్రైనేజీ సమస్యలకు తక్షణ చర్యలు తీసుకోవాలి

వనస్థలిపురం: వర్షాకాలం వచ్చే డ్రైనేజీ సమస్యలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సుష్మ చౌరస్తా సమీపంలో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు పొంగిపొర్లుతూ రోడ్డుపై పారుతుండడంతో స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో సోమవారం సంబంధిత సిబ్బందితో మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించి మురుగు సమస్యను పరిష్కరించారు.

ప్రజావాణికి స్పందన కరువు

చాదర్‌ఘాట్: ప్రతీ సోమవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి స్పందన కరువైందని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని ఆయన స్పష్టం చేశారు. సర్కిల్‌లోని ప్రజలంతా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూసీడీ, ట్యాక్స్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు జలవిహార్‌లో ర్యాలీ

చాదర్‌ఘాట్: నేడు జలవిహార్‌లో జరిగే డ్రగ్స్ డీ అడిక్షన్ డే ర్యాలీని విజయవంతం చేయాలని రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. సోమవారం ఆమె మలక్‌పేటలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి భట్టి విక్రమార్క పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా వివిధ రంగాలలో పేరొందిన అనేక మంది పాల్గొంటారని తెలిపారు. డ్రగ్స్ వలన యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నాయని దీనికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

చైతన్యపురి: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, సలహాలు, సూచనలు తెలిసుకునేందుకు డ యల్ యువర్ డీఎం కార్యమాన్ని నిర్వహిస్తున్నట్లు దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపో మేనేజర్ హరి తెలిపారు. రవాణా సమస్యలు, సూచనలు తెలియజేయాలనుకునే ప్రయాణికులు మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 9959226137 నెంబర్‌ను ఫోన్ చే యాలని సూచించారు.

స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి..

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

మీర్‌పేట: ప్రమాదవశాత్తు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ స్విమ్మింగ్ పూల్‌లో మునిగి మృతి చెందాడు. మీర్‌పేట ఎస్‌ఐ రాంబాబు, స్థానికుల కథనం ప్రకారం... భీమవరానికి చెందిన శ్రీనివాసరావు కుమారుడు సంపత్‌కుమార్(26) టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ మీర్‌పేట ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. వీకెండ్ కావడంతో ఈత కొట్టేందుకు ఆదివారం స్నేహితులతో కలిసి నాదర్‌గుల్‌లోని జీఎస్‌ఆర్ స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లాడు. స్విమ్మింగ్ చేస్తూ లోతు ఎక్కువగా ఉన్న చోటకు వెళ్లి మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు స్విమ్మింగ్‌పూల్ వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈత రాకపోవడంతోనే సంపత్‌కుమార్ మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

వివాహిత హత్య

- మృతురాలి భర్త కోసం గాలింపు

చైతన్యపురి: వివాహిత హత్యకు గురైన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం... చంపాపేట బృందావన్ కాలనీలో భార్యాభర్తలు అన్వర్, మహమ్మద్ గౌసియా (30) ఇల్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగించే వీరు నిత్యం మద్యం సేవించి గొడవలు పడుతుండేవారు. ఆదివారం సాయంత్రం ఇంటి పక్కన ఉండే శోభ అనే మహిళ గౌసియాను పిలువగా పలకలేదు. దీంతో లోనికి వెళ్లి చూడగా గౌసియా రూంలో అపస్మారక స్థితిలో పడి ఉంది. ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉండటం గమనించింది. దీంతో చుట్టుపక్కల వారిని పిలిచి విషయం చెప్పింది. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే గౌసియా మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేశారు. మృతురాలి మెడ చుట్టూ, రెండు చేతులకు గాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గౌసియాను భర్తే హత్యచేశాడని భావిస్తున్నారు. పరారీలో ఉన్న అన్వర్ కోసం గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పోలీసులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరు



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

- బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్

మలక్‌పేట: పోలీసులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని, అలా చేసిన ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్ అన్నారు. నిరుద్యోగ సమస్యలపై పోరాడుతున్న బీజేవైఎం నాయకులపై జరిగిన దాడికి నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం భాగ్యనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మూసారంబాగ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. బీకే ఫంక్షన్ హాల్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాయకులు చౌరస్తా వరకు ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అనుముల భరత్‌కుమార్ మాట్లాడుతూ సర్కార్ నిరుద్యోగుల సమస్యలను గాలికొదిలేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, గ్రూప్ 2,3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని, 25వేల టీచర్ పోస్టుల మోగా డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్ చేశారు. టీజీపీఎస్సీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులపై పోలీసుల దాడిహేయమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్, నాయకులు నవీన్, దినేష్, ఈశ్వర్‌యాదవ్, సిరివెన్నెల, వెంకటేష్, ప్రశాంత్, కిరణ్, రవికుమార్, యోగేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

- ఫ్లైఓవర్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, భద్రత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద నూతనంగా నిర్మాణం జరుపుకుంటున్న ఫ్లైఓవర్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 850 మీటర్ల మేరా ఫ్లైఓవర్ నిర్మాణం జరుగనుందని, చింతలకుంటపై ఎలక్ట్రానిక్స్ నుంచి ప్రారంభమై సుష్మా చౌరస్తా దాటిన తర్వాత ముగుస్తుందని అన్నారు. ఈ ఫ్లైఓవర్ పూర్తయితే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు ఉండవని అన్నారు. అలాగే చంపాపేట డీమార్ట్ దగ్గర ఒక ఫ్లైఓవర్, బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా వద్ద మరో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేయడం జరిగిందని అన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: మైనర్ బాలిక పట్ల లైంగిక దాడికి యత్నించిన బి.మల్లికార్జున్(46)కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష తోపాటు 10వేల రూపాయలు జరిమానాను రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి విధించారు. కోర్టు పిపి సునితా బర్ల తెలిపిన కథనం మేరకు వివరాలివి...మీర్‌పేట్ ఠాణా పరిధిలో మైనర్ బాలిక తన తల్లితో కలిసి నివసించేది. బాలిక తల్లి తన సోదరుని అంత్యక్రియల కోసం మైనర్ బాలికను తోటికోడలు ఇంట్లో వదిలి వెళ్లింది. అదే ఇంట్లో నివసించే నిందితుడు మల్లికార్జున్ బాలికపై లైంగిక దాడికి పాల్పడేందుకు ప్రయత్నించగా తన తల్లితో విషయాన్ని తెలిపింది. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మీర్‌పేట్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, సాక్షులను విచారించిన కోర్టు శుక్రవారం విధించారు.